రేపు పరిగిలో మెగా జాబ్‌మేళా

పరిగి, జనవరి 21: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 23న పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నెం:1 పాఠశాల మైదానంలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి షేక్అబ్బుస్ సుభాన్ తెలిపారు. ప్రముఖ 50 కంపెనీల్లో ఐదువేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9676947444, 9182477163, 6305197076 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రతీ పేద ఇంటికి ఆరు సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆ పార్టీ ప్రజల్లోకి బలంగా తీసుకుపోయింది. అనుకున్నట్టే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అనంతరం ఆరు గ్యారంటీ స్కీములకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. అయితే ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల్లో ఎక్కువగా 18ఏళ్లు నిండిన ప్రతీ పేద మహిళకు నెలకు రూ.2,500 ఇచ్చే(నగదు బదిలీ), దాని తరువాత రూ.500కే గ్యాస్ సిలిండర్ స్కీమ్ (మహాలక్ష్మి)లకే ఎక్కువ మంది మొగ్గు చూపారు. వీటి తరువాత ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంటు పథకాలు ఉన్నాయి. ప్రజా పాలనలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,22,701 దరఖాస్తులు రాగా వాటిల్లో వివిధ స్కీములకు 42,24,636 అభ్యర్థనలొచ్చాయి.

మహాలక్ష్మిపై ఆశలు

'అభయహస్తం' అమలుకు ఎదురుచూపులు





పేదలకే ప్రాధాన్యం?

సహజంగా ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం ప్రవేశపెట్టినా మొదట పేదలను దృష్టిలో పెట్టుకొనే స్కీముల రూపకల్పన చేస్తుంది. వారి తరువాతనే మధ్య తరగతి, ఉన్నత వర్గాలకు ప్రాధాన్యం కల్పిస్తుంది. దీన్ని బట్టి చూస్తే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమంలో ప్రతీ ఇంటి నుంచి దరఖాస్తులు స్వీకరించినప్పటికీ మొదట ఫుడ్ సెక్యూరిటీ కార్డు(రేషన్ బియ్యం తీసుకునే వారు) ఉన్న మహిళలకు మొదటి ప్రాధాన్యం ఇస్తుందనే చర్చ కొనసాగుతుంది. దీనినే ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉంది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా కొత్తగా రేషన్ కార్డులను ఇవ్వకపోవడం, కొన్ని కుటుంబాలు వేరు పడటం, కార్డు ఉన్నా పిల్లల పేర్లు ఎక్కక పోవడం, అప్పట్లోనే చాలా మందికి కార్డులు ఇవ్వకపోవడం, అలాగే కొత్తగా పెళ్లయిన కుటుంబాలకు ఆహార భద్రత కార్డులు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. నిజంగా పేదలే అయినా వారికి ఫుడ్ సెక్యూరిటీ కార్డు లేదనే సాకుతో పథకాలను వర్తింపజేయకుంటే అర్హులు నష్టపోయే ఆస్కారం ఉంది. కాబట్టి లబ్ధిదారుల ఎంపిక గ్రామసభ నిర్వహించి చేపడితే రేషన్ కార్డు ఉన్నా, లేకున్నా నిజమైన అర్హులకు పథకాలు వర్తిస్తాయనే చర్చ గ్రామాల్లో సాగుతోంది. అయితే ప్రభుత్వం ఈ ప్రక్రియంతా పూర్తి చేయడానికి కొంత సమయం పట్టే అవకాశం లేకపోలేదు. రానున్నది సార్వత్రిక ఎన్నికల కాలం. ఎన్నికల షెడ్యూల్, కోడ్ అమల్లోకి రాకముందే కొన్ని పథకాలనైనా అమలు చేసి లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు రాబట్టాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో రానున్న రెండు నెలల్లో కొన్ని ఆరు గ్యారంటీల్లో కొన్నింటినైనా అమలు చేయాలనే నిశ్చయంతో ఉంది.

జిల్లా	వచ్చిన దరఖాస్తులు	అభ్యర్థనలు
వికారాబాద్	2,84,275	13,24,270
రంగారెడ్డి	5,10,709	20,99,208
మేడ్చల్-మల్కాజ్‌గిరి	2,27,717	8,01,158
మొత్తం	10,22,701	42,24,636

- ప్రతీ పేద మహిళకు నెలనెలా రూ.2,500 స్కీంకు 9,14,678 అప్లికేషన్లు
- రూ.500కే ఎల్పీజీ సిలిండర్‌కు 8,51,950 అభ్యర్థనలు
- ఇందిరమ్మ ఇళ్లకు 8,00,477..
- 200 యూనిట్ల ఉచిత కరెంట్‌కు 7,90,863 విజ్ఞాపనలు
- గ్యారంటీ పథకాలపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలకు భారీ ఆశలు
- మార్గదర్శకాలు విడుదలైతేనే అర్హుల్లో స్పష్టత

వికారాబాద్,(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) జనవరి 21 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు భారీగా ఆశలు పెట్టుకున్నారు. అభయ హస్తం ఆరు గ్యారంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి భారీ సంఖ్యలో దరఖాస్తులొచ్చాయి. ఈ దరఖాస్తుల్లో అత్యధికంగా మహాలక్ష్మి(నగదు బదిలీ), ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి పథకాలకు అభ్యర్థనలు వచ్చాయి. మహాలక్ష్మి స్కీమ్ కింద మహిళకు నెలనెలా రూ.2,500, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలకు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆరు గ్యారంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలనూ వర్తింపజేయాలని కోరుతూ ప్రజల నుంచి వచ్చిన 10,22,701 దరఖాస్తుల్లో వివిధ పథకాలకు మొత్తం 42,24,636 అభ్యర్థనలున్నాయి. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ వికారాబాద్ జిల్లాలో పూర్తి చేసి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ)కు అప్పగించగా, అభ్యర్థనల పరిశీలన కొనసాగుతోంది. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తుల్లో పొందుపరిచిన వివరాలన్నీ సవ్యంగా ఉన్నట్లు ధ్రువీకరించిన తరువాత అర్హుల ఎంపికకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ కానున్నట్లు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి విదేశాల నుంచి రాగానే దరఖాస్తులపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఏ పథకం కోసం ఎన్నెన్ని దరఖాస్తులొచ్చాయి, అమలు చేసేందుకు ఏ మేర నిధులు కేటాయించాల్సి వస్తుందనే విషయమై సీఎం తన మంత్రివర్గ సహచరులతో కూలంకశంగా చర్చించనున్నట్లు తెలిసింది.

క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తరువాతే...

ఇదిలా ఉంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అభయ హస్తం గ్యారంటీలు, ఇతర సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఆరు గ్యారంటీలతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలను వర్తింపజేసేందుకు ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో సబ్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అభయహస్తం దరఖాస్తుల్లోని వివరాలను ప్రజాపాలన పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తయిన తరువాత ప్రజల దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టనున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అభయహస్తం గ్యారంటీలకు, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు దరఖాస్తు చేసుకునేందుకు నియమ నిబంధనలంటూ ఏమీ లేకపోవడంతో పేద మధ్య తరగతులకు చెందిన వారితో పాటు ధనవంతులూ దరఖాస్తు చేసుకున్నారు. ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలందరికీ ఉచిత ప్రయాణం అనుమతించినట్లుగానే కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వర్తింపజేస్తుందనే ఆశాభావంతో చిన్నాపెద్దా, పేద ధనిక అంటూ తేడా లేకుండా చాలా వరకు అందరూ దరఖాస్తు చేసుకున్నారు. సాధారణంగా ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, ప్రభుత్వేతర సంస్థల ఉద్యోగులను అనర్హులుగా పరిగణిస్తారు. అలాగే కొంత మేరకు ఆదాయ పన్నుదారులను కూడా పేదలకు అమలు చేసే సంక్షేమ పథకాల నుంచి మినహాయిస్తారు. సంక్షేమ పథకాల అమలుకు ప్రధానంగా దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న వారినే పరిగణలోకి తీసుకుంటారు. తెల్లరేషన్ కార్డులను ప్రాతిపదికగా లెక్కిస్తారు. కాగా ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీలకు, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు చాలా వరకు ప్రభుత్వ ఉద్యోగులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యంగా 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు స్కీమ్ తమకు కూడా వర్తిస్తుందని ఉద్యోగులు, ట్యాక్స్ పేయర్లు, తెల్ల రేషన్ కార్డు లేని వారు భావిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీములకు ప్రభుత్వ ఉద్యోగులు దరఖాస్తు చేసుకోకూడదనే నియమమేదీ లేకపోవడంతో వారి కుటుంబీకుల సైతం దరఖాస్తు చేసుకున్నారు. అయితే అభయహస్తం ఆరు గ్యారంటీలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు ఎవరిని అర్హులుగా పరిగణిస్తారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గ్యారంటీలు, పథకాలు వర్తింపజేసేందుకు పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు విడుదల అయితేనే అర్హులు ఎవరనేది స్పష్టత రానుంది.

ఉమ్మడి జిల్లా పరిధిలో వచ్చిన అభ్యర్థనల వివరాలు

పథకం	వికారాబాద్	రంగారెడ్డి	మేడ్చల్-మల్కాజ్‌గిరి
మహిళలకు నెలనెలా రూ.2,500	2,59,441	4,56,839	1,98,398
రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్	2,27,773	4,32,676	1,91,501
ఇందిరమ్మ ఇళ్లు	2,64,242	3,86,695	1,49,540
200 యూనిట్ల ఉచిత విద్యుత్	2,09,560	3,99,866	1,81,437
రైతు భరోసా(రూ.15వేలు)	1,54,239	1,85,905	28,858
కౌలు రైతులకు రూ.15వేలు	5,080	7,362	1,606
రైతు కూలీలకు రూ.12వేలు	1,46,390	1,24,518	7,531
అమరుల కుటుంబాలకు 250 గజాలు	265	1,031	468
ఉద్యమకారులకు 250 గజాలు	1,027	3,297	1,654
దివ్యాంగుల పింఛన్లు	6,546	13,271	5,524
ఇతర పింఛన్లు	49,707	87,745	34,641
మొత్తం	13,24,270	20,99,208	8,01,158



అనంతగిరిపల్లి సమీపంలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం వద్ద వినియోగదారుల క్యూ

వంటగ్యాస్ కష్టాలు

- 20 రోజుల క్రితం బుక్ చేసినా డెలివరీ కాని గ్యాస్ సిలిండర్లు
- హెచ్‌పీ గ్యాస్ గోదాం వద్ద వినియోగదారుల పడిగాపులు

వికారాబాద్, జనవరి 21: వంట గ్యాస్ కోసం వినియోగదారులు నానా కష్టాలు పడుతున్నారు. 20రోజుల క్రితం గ్యాస్ కోసం బుక్ చేసుకున్నప్పటికీ ఇంటికి గ్యాస్ రాక పోవడంతో ప్రజలు గోదాంబాట పడుతున్నారు..గ్యాస్ బండి ఎప్పుడు వస్తుందో అని ఎదురుచూస్తున్నారు. ఖాళీ సిలిండర్లు లైన్‌లో పెట్టి కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. గ్యాస్ ఎప్పుడు వస్తుందో చెప్పడానికి కూడా హెచ్‌పీ గ్యాస్ నిర్వాహకులు ఎవరూ అక్కడ లేక పోవడంతో పడిగాపులుగాస్తున్నారు. గతంలో అదనపు కలెక్టర్ స్పందించి గ్యాస్ సమస్య లేకుండా చేస్తామని చెప్పినా ఫలితం లేకుండాపోయిందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో గ్యాస్ కష్టాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక ఓటరు నమోదుకు విశేష స్పందన

- వికారాబాద్ జిల్లాలో 5,520 దరఖాస్తులు
- మేడ్చల్ జిల్లాలో 1,255 దరఖాస్తుల స్వీకరణ



కులకచర్ల: ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో విజయకుమారి

వికారాబాద్/మేడ్చల్ జనవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. వికారాబాద్ జిల్లాలో రెండు రోజుల్లో మొత్తం 5520 దరఖాస్తులు వచ్చాయి. కొత్తగా ఓటరు జాబితాలో చేర్చడానికి 2057దరఖాస్తులు రాగా, ఓటరు జాబితాలో చేర్చడం, తొలగించే ప్రతిపాదనలపై అభ్యంతరం (ఫారం-7) తెలియజేస్తూ 2615 దరఖాస్తులు వచ్చాయి. అదే చిరునామా మార్పు, వివరాల్లో మార్పులు, చేర్పులు, ఎపిక్ కార్డు మార్చడం (ఫారం-8) కోసం 848 దరఖాస్తులు అందాయి. ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1133 పోలింగ్ కేంద్రాల్లో 1133 బీఎల్‌వోలు దరఖాస్తులు స్వీకరించారు. పరిగి నియోజకవర్గంలో ఫారం-6 దరఖాస్తులు 657 రాగా, ఫారం-7 దరఖాస్తులు 458, ఫారం-8 దరఖాస్తులు 243 దరఖాస్తులు వచ్చాయి. వికారాబాద్ నియోజకవర్గంలో 394 ఫారం-6 దరఖాస్తులు రాగా, ఫారం-7 దరఖాస్తులు 423, ఫారం-8 దరఖాస్తులు 249 వచ్చాయి. తాండూరు నియోజకవర్గంలో ఫారం-6 దరఖాస్తులు 464 రాగా, ఫారం-7 దరఖాస్తులు 48, ఫారం-8 దరఖాస్తులు 87 వచ్చాయి. కొడంగల్ నియోజకవర్గంలో 542 ఫారం-6 దరఖాస్తులు అందగా, ఫారం-7 దరఖాస్తులు 1686, ఫారం-8 దరఖాస్తులు 269 వచ్చాయి. కాగా మేడ్చల్ జిల్లాలో కొత్తగా ఓటరు జాబితాలో చేర్చడానికి 846 దరఖాస్తులు రాగా, ఫారం-7 తెలియజేస్తూ 35 దరఖాస్తులు వచ్చాయి. ఫారం-8 కోసం 374 దరఖాస్తులు అందాయి. రెండు రోజుల్లో జిల్లాలో మొత్తం 1255 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 2439 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు దరఖాస్తులు స్వీకరించారు.

అడుగుకో గుంత.. ఆదమరిస్తే అంతే..

- ప్రాణసంకటంగా మంబాపూర్- కందనెల్లి రోడ్డు



ఖానాపూర్‌లో రోడ్డుపై గుంతలు

పెద్దేముల్, జనవరి21: అడుగుకో గుంతతో పెద్దేముల్‌మండలం కందనెల్లి వాగు మలుపు నుంచి సుమారు కిలోమీటర్ వరకు రోడ్డంతా పాడైంది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనం నడపలేని పరిస్థితి తయారైంది. వాహనదారులు ఒక గుంతను తప్పించబోయి మరోగుంతలో పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నినెలల క్రితం గుంతను తప్పించబోయి రెండు బైకులు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఇటీవలే కారు ప్రమాదానికి గురై నుజ్జునుజ్జయింది. ఈ రోడ్డును పట్టించుకునేవారే కరువయ్యారు. ఇది తాండూరు-హైదరాబాద్ ప్రధానరోడ్డు అయినప్పటికి మరమ్మతులు చేయక పోవడంతో జనం పాలకులపై దుమ్మెత్తిపోస్తున్నారు. చీకట్లో ఎదురుగా వచ్చే వాహనం లైట్ల వెలుతురుకు గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రోడు మరమ్మతుల కోసం జనాలు రోడ్డుపైకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన షురూ!

- రేషన్ దుకాణాల్లో అధికారుల తనిఖీ.. బినామీల ఏరివేతపై దృష్టి




మేడ్చల్‌లో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారి

మేడ్చల్ జనవరి 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : అస్తవ్యస్తంగా మారిన ప్రజా పంపిణీ వ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రేషన్ దుకాణాలు, డీలర్లు, సంబంధిత శాఖ అధికారులపై నిత్యం ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. డీలర్లలో పెద్ద సంఖ్యలో బినామీలున్నట్లు ఆరోపణలు వస్తుండటంతో చక్కదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జనవరి 31లోగా బినామీ డీలర్లను గుర్తించి ఏరివేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అధికారులు రేషన్ దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మేడ్చల్ జిల్లావ్యాప్తంగా రూరల్ పరిధిలో 169, జీహెచ్ఎంసీ పరిధిలో 450, మొత్తం 619 రేషన్ దుకాణాలున్నాయి. 5,06,364 ఆహారభద్రత కార్డులు, 17,690 అంత్యోదయ, 99 అన్నపూర్ణ కార్డులున్నాయి. ఇందులో దాదాపు పదుల సంఖ్యలో బినామీ డీలర్లున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థను చక్కదిద్దాలంటే మొదటగా బినామీ డీలర్లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జారీ చేసిన ఆదేశాల మేరకు రేషన్ దుకాణాల్లో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. బినామీలు నిర్వహిస్తున్నట్లు తేలితే సదరు డీలర్‌షిప్‌ను రద్దు చేయనున్నారు. తనిఖీల తీరు, గుర్తించిన బినామీలు, వారిపై తీసుకున్న చర్యలతో ఈ నెల 31లోగా నివేదికలు ఇవ్వాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో పౌరసరఫరాల శాఖ కమీషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశించారు. అధికారులు ప్రతి రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తూ డీలర్‌పై ఆరా తీస్తున్నారు.

అంతా... రామమయం

- రాములోరి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జిల్లాల్లో వేడుకలకు సర్వం సిద్ధం
- వాడవాడలా ఉత్సవాలు



బొరాంపేట: హకీంపేటలో విద్యుత్ కాంతుల్లో ఆలయం

వికారాబాద్/మేడ్చల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అపురూప స్వప్నం మరికొన్ని గంటల్లో సాకారం కాబోతోంది. ఈనెల 22వ తేదీ, సోమవారం అయోధ్యలో శ్రీ రామచంద్రుడు కొలువుదీరబోతున్న అపురూప ఘట్టాన్ని మహా వేడుకలా నిర్వహించేందుకు వికారాబాద్, మేడ్చల్ జిల్లాల ప్రజలు సన్నద్ధమవుతున్నారు. బాలరాముడి విగ్రహ పాణప్రతిష్ఠ కార్యక్రమం దిగ్విజయం కావాలని ఆయా జిల్లాల్లో పెద్ద ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేవాలయాల్లో స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం అయోధ్యలో జరగనున్న శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం పురస్కరించుకుని గ్రామాలు, పట్టణాలు, కాలనీల్లోని దేవాలయాలను శుభ్రం చేసి ప్రత్యేక పూజలు, ర్యాలీలు, అన్నదానాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చురుకుగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇళ్లపైన ఎగురవేసిన కాషాయ జెండాలు రెపరెపలాడుతున్నాయి. శివ, వైష్ణవ దేవాలయాలనే బేధం లేకుండా శ్రీరామచంద్రుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయోధ్యలో జరిగే శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించేందుకు దేవాలయాల్లో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఇంటింటా దీపోత్సవం

తమ ఇళ్లలో ప్రధానద్వారం ఎదుట శ్రీరామతత్వం ఉట్టి పడేలా ముగ్గులు వేయడం, శ్రీరామచంద్రుడిని పూజించడం, ఇంట్లో భద్రపరిచిన శ్రీరాముడి అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించేలా కార్యక్రమాలు చేపడుతున్నారు. అనంతరం అన్నదానాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఇంటింటా దీపాలు వెలిగించడం, దేవాలయాల్లో దీపోత్సవాలు నిర్వహించనున్నారు. దేవాలయాల్లో హనుమాన్ చాలీసా, సుందరకాండ, శ్రీరామ చరిత మానస్ పారాయణం, భజనలు వంటి కార్యక్రమాలూ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే, ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య భవన్‌లో శ్రీరామ జయరామ మహాజప యజ్ఞం నిర్వహించారు. ప్రముఖ వక్త డాక్టర్ భాస్కరయోగి మాట్లాడుతూ, శ్రీరాముడు భారతదేశ ఆధ్యాత్మిక నాయకుడని, పేర్కొన్నారు.



మేడ్చల్ మార్కెట్‌లో కాషాయ తోరణాలు



వికారాబాద్‌లో బైక్ ర్యాలీ



అగ్గి పుల్లలతో రామ మందిరం

పెద్దేముల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన యువకుడు వినూత్నరీతిలో రాముడిపై భక్తిని చాటాడు. గ్రామానికి చెందిన రేగొండ సాయిమనోజ్ అగ్గి పుల్లలతో రామమందిరం నమూనాను తయారు చేశాడు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

బొంరాస్‌పేట్, జనవరి 21: మండలంలోని వడిచర్ల గ్రామానికి చెందిన నవీన్‌గౌడ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.1,25000 ఎల్‌వోసీ చెక్కును ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జి.నర్సింహులుగౌడ్ ములుగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, దేశ్యనాయక్, నర్సింహులునాయుడు, మల్లేశ్, గోపాల్‌రెడ్డి, అంజిగౌడ్, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కలను అడవిలో వదిలిన సర్పంచ్, సెక్రెటరీపై కేసు

మేడ్చల్ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కల బెడదనుంచి గ్రామస్తులను రక్షించటానికి సర్పంచ్, కార్యదర్శి చేసిన ప్రయాస బెడిసి కొట్టింది. చివరికి నోరు లేని మూగ జీవులను అడువుల్లోకి వదిలేయడంపై ఎనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సంస్థవారు పోలీసులను ఆశ్రయించారు. సర్పంచ్, కార్యదర్శిపై కేసు నమోదు చేయించారు. మేడ్చల్ జిల్లా కేంద్రంలోని మురాహరిపల్లి గ్రామంలో కుక్కల బెడద అధికమైంది. దీంతో గతనెల 11వ తేదీన పంచాయతీ వారు కుక్కలను పట్టి గ్రామానికి దూరంగా అడువుల్లో వదిలారు. విషయం తెలుసుకున్న వీసీపే ఎనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ గౌతమ్, అసిస్టెంట్ లక్ష్మీప్రసన్నలు ఈ విషయంపై సర్పంచ్‌ను ఆరాతీయగా నిజమేనని చెప్పారు. దీంతో వారిపై మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు తగిన విచారణ జరిపి కేసు నమోదు చేశారు. వీధికుక్కల బెడద నుంచి తప్పించుకోవడానికి వాటిని పట్టి చంపడంగానీ, ఆకలి దప్పికతో చావడానికి అడవుల్లో వదిలేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు.

ముగిసిన కిసాన్ మహోత్సవాలు



వ్యవసాయ రంగంలో ప్రతిభ కనబరిచిన వారిని సన్మానిస్తున్న నిర్వాహకులు

మేడ్చల్ టౌన్, జనవరి 21మల్లారెడ్డి అగ్రికల్చర్ స్కూల్ ఆఫ్ సైన్స్, ఏరువాక ఫౌండేషన్ వారు రెండు రోజులుగా నిర్వహిస్తున్న కిసాన్ మహోత్సవాలు ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి ఏరువాక ఫౌండేషన్ వారు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన నిపుణులతో పాటు అనుబంధంగా ఉండే రంగాలకు సంబంధించిన నిపుణులు పాల్గొని తమ అనుభవాలను ఇతరులతో పంచుకున్నారు. వ్యవసాయ రంగంపై అనేక అంశాల పట్ల చర్చలు జరిగాయి. వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడానికి అవసరమయ్యే సాంకేతిక వనరుల పట్ల ప్రత్యేక అధ్యయనం చేశారు. అదేవిధంగా పలు ప్రదర్శనలు ఏర్పాటు చేసి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి యూనివర్సిటీ అధ్యాపకులు, ఏరువాక ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు, వ్యవసాయ రంగ నిపుణులు పాల్గొన్నారు.

ఇస్తారా.. ఇంకా జాప్యం చేస్తారా?

▸ డబుల్ ఇళ్ల పంపిణీ ఇప్పట్లో లేనట్లేనా..! ▸ సందిగ్ధంలో దరఖాస్తుదారులు


నిర్మాణం పూర్తయిన డబుల్‌బెడ్‌రూమ్‌లు

తాండూరు, జనవరి 21 : పేదల కోసం గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూంల పంపిణీపై సందిగ్ధత ఏర్పడింది. తమకు ఇళ్లు ఎప్పుడిస్తారోనని లబ్ధిదారులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. తాండూరు-వికారాబాద్ మార్గంలో ఖాంజాపూర్ గేట్ వద్ద గత ప్రభుత్వం కేసీఆర్ నగర్ పేరుతో ఇక్కడ డబుల్‌బెడ్‌రూంల నిర్మాణం చేపట్టింది. గతేడాది ఏప్రిల్‌లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, పరిశీలించేంత వరకు సక్రమంగా జరిగినా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పంపిణీకి బ్రేక్ పడింది. ఇంతలో ప్రభుత్వం మారటంతో డబుల్ బెడ్‌రూంలు పంపిణీ చేస్తారా.. ఇంకా జాప్యం చేస్తారా.. అన్న చర్చ జరుగుతోంది.

ఇప్పట్లో పంపిణీ లేనట్టే

బీదలకు డబుల్‌బెడ్‌రూంలను ఇవ్వాలని ఇటీవల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 34వ వార్డులో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని స్థానిక కౌన్సిలర్ సోమశేఖర్ కోరారు. బ్లాక్‌ల నిర్మాణం పూర్తయ్యాక అర్హులైన వారిని గుర్తించి పంపిణీ చేస్తామని ఆయన చెప్పడంతో నిర్మాణం పూర్తయిన డబుల్‌బెడ్‌రూంలు ఇప్పట్లో పంపిణీ జరిగే అవకాశాలు లేవని స్పష్టమవుతోంది.

ఆరేళ్లుగా సాగదీత..

2018లో ప్రారంభమైన పనులు.. 6 ఏళ్లు గడుస్తున్నా పూర్తికాలేదు. 1001 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు 581 ఇళ్లు పూర్తయ్యాయని సమాచారం. 5 బ్లాకుల పనులు స్లాబ్ స్థాయిలో ఉండగా, మరో 7 బ్లాకులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ ప్రభుత్వమైనా తమ సొంతింటి కలను నెరవేరుస్తుందని ప్రజలు ఆశతో ఉన్నారు. ఇటీవల ప్రజాపాలనలో కూడా తాండూరు మునిసిపాలిటీలో 9436 మంది డబుల్‌బెడ్‌రూంల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నారు.

'పార్లమెంట్' బరిలో మల్లు రవి


మల్లు రవికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, జనవరి 21 : టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి కాంగ్రెస్ తరఫున నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి పోటీ సిద్ధమవుతున్నారు. గత ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి మల్లు రవి విశేష కృషి సలిపారు. పార్టీ అధిష్ఠానం వద్ద మల్లుకు మంచి గుర్తింపు ఉంది. ఈనేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థిత్వంపై ఇప్పటికే భరోసాగా ఉన్నమల్లు పోటీకి తగిన వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ఇందుకోసమే మల్లు రవిని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించినట్లు ప్రచారం సాగుతోంది. ఆ పదవి ద్వారా సునాయాసంగా ప్రజల్లోకి వెళ్లవచ్చన్న భావనతో కాంగ్రెస్ వర్గీయులు భావిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తే కేంద్రమంత్రిగా అవకాశాలున్నాయని తెలిసింది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం గ్రామస్థాయిలో కాంగ్రెస్‌కు మరింత బలం చేకూరింది. అదేవిధంగా పార్లమెంట్ పరిధిలో 5 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వారే ఉన్నారు. దాంతో గెలుపు సునాయాసమని మల్లు రవి ఒకింత ధీమాగా ఉన్నట్లు సమాచారం. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్‌తో పాటు మల్లుకు బలమైన అనుచర వర్గం ఉంది. నాగర్‌కర్నూల్ నుంచి 1991, 1998లో రెండు పర్యాయాలు మల్లు రవి ఎంపీగా గెలుపొందారు. గతంలో ఏఐసీసీ సభ్యుడిగా, 2004-2008 వరకు అప్పటి వైఎస్ ప్రభుత్వంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మల్లు పనిచేశారు. ఏఐసీసీ, యూత్ కాంగ్రెస్‌లోనూ ఆయన పలు పదవులు నిర్వహించారు. ఉన్నత విద్యావంతుడైన మల్లు రవికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సమస్యలపై మంచి అవగాహన ఉంది. సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా, విశ్వాసపాత్రుడిగా మల్లు రవికి పేరుంది. ఈనేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి మల్లు రవికి అభ్యర్థిత్వం సునాయాసమేనన్న భావన వ్యక్తమవుతోంది.

మల్లు రవికి కాంగ్రెస్ నాయకుల సన్మానం

ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధిగా మాజీ ఎంపీ, పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి నియామకం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్యానాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, బీచ్యనాయక్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని మల్లును కోరినట్లు తెలిపారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు


కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

ధారూరు, జనవరి 21 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆ పార్టీ జిల్లా నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శ్రీ అనంతపద్మనాభ స్వామి దేవస్థానం, అనంతగిరి గుట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు రూ. 100 కోట్లు కేటాయించి, నిధులు విడుదల చేయించిన కిషన్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అన్ని రంగాలలో వెనుకబడిన వికారాబాద్ జిల్లా అభివృద్ధికి సహకరించాలని మంత్రిని కోరినట్లు వారు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, నాయకులు నరోత్తంరెడ్డి, శ్రీధర్ ఉన్నారు. అనంతరం బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా, మహిళ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నియామకమయిన బొక్కా నర్సింహారెడ్డి, శిల్పారెడ్డిని కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

జాతీయస్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ


కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన మేడ్చల్ విద్యార్థులు

మేడ్చల్‌టౌన్, జనవరి 21 : జాతీయస్థాయి కరాటే పోటీల్లో మేడ్చల్ పట్టణం యూనివర్సెల్-369 మార్షల్ ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పలువురు విద్యార్థులు గోల్డ్‌మెడల్స్‌ను సాధించారు. ఆదివారం నగరంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటారు. కలాస్ విభాగంలో కృపారాణి, రోజి, మేరి గోల్డ్‌మెడల్స్‌ను దక్కించుకోగా, అమూల్య, వినీషా సిల్వర్ మెడల్స్‌ను దక్కించుకున్నారు. మనోజ్ఞ, మైథిలిలు బ్రౌన్జ్‌మెడల్స్‌ను దక్కించుకున్నారు. స్పైరింగ్ విభాగంలో వరుణ్ తేజ్, రిషి, గోవింద్, వీరభద్ర, కృష్ణ ప్రియలకు గోల్డ్‌మెడల్ దక్కగా, చరణ్ సిల్వర్ మెడల్ ద క్కించుకున్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనపరిచిన ఈ విద్యార్థులు ఈనెల 28న జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారని, మరో 50 మంది విద్యార్థులు కూడా పాల్గొంటారని గ్రాండ్ మాస్టర్ పరమేష్, మాస్టర్ సాయికుమార్, అక్షయ్, జి.మంజుల తెలిపారు.

సౌత్‌జోన్‌లో.. సార్లరావులపల్లి బాలిక

కందుకూరు : మండలంలోని సార్లరావులపల్లి గ్రామానికి చెందిన జర్పుల భువనశ్రీ అనే బాలిక కరాటే(వుషు)లో సత్తాచాటి మూడవ బహుమతిని కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ముగింపు వేడుకల్లో నిర్వాహకులు ఆమెకు అందజేశారు. ఈనెల 18 నుంచి 21వరకు కోయంబత్తూరులో అండర్- 14 బాలికల విభాగంలో కరాటే (వుషు) పోటీలు జరిగాయి. కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. భువనశ్రీ సార్లరావులపల్లి గ్రామ సర్పంచ్ జె.రజితప్రవీణ్‌నాయక్ కుమార్తె కావడం విశేషం. ఈ సందర్భంగా గ్రామంలో ఆదివారం సంబురాలను జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో కోచ్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో బెల్ట్ ప్రమోషన్ టెస్ట్

కీసర రూరల్ : నాగారం మునిసిపాలిటీలోని శివసాయి గార్డెన్‌లో ఆదివారం చిదంబ్ తైక్వాండో ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ నిర్వహించారు. 200మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. గెలుపొందిన విద్యార్థులకు బెల్ట్‌తో పాటు సర్టిఫికెట్స్‌ను అందజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగారం పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు గూడూరు ఆంజనేయులు మాట్లాడుతూ కరాటేతో చిన్నారుల్లో మనోధైర్యం పెరుగుతుందన్నారు. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, గ్రాండ్ మాస్టర్ ప్రవీణ్‌కుమార్, చిదంబ్ తైక్వాండో సంస్థ నిర్వాహకుడు నంద కిషోర్, పాల్గొన్నారు.



బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతులమీదుగా విశిష్ఠ అధ్యాపక అవార్డు అందుకుంటున్న మహిపతి శ్రీనివాస్‌రావు

'అనురాగ్' అధ్యాపకుడికి 'విశిష్ఠ' అవార్డు

ఘట్‌కేసర్ రూరల్ జనవరి 21 : నైపుణ్యం కలిగిన అధ్యాపకులు ఉన్నప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జనగా ఎమ్మెల్యే, అనురాగ్ యూనివర్సిటీ ఛైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. నగరంలోని రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో శనివారం రాత్రి అంబిషన్స్ కెరీర్ కౌన్సిల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకుడు మహిపతి శ్రీనివాస్‌కు విశిష్ఠ అధ్యాపక అవార్డును పల్లా రాజేశ్వర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యాసంస్థల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యవంతమైన అధ్యాపకులు ఉన్నప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. శ్రీనివాస్ రెండు దశాబ్ధాలుగా ఇంగ్లీష్ మాధ్యమంలో, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తూ విశిష్ఠ సేవలు అందిస్తున్నట్లు గుర్తుచేశారు. ఇంగ్లీషు ప్రాధాన్యత ఎంతో పెరిగిందని, విద్యార్థులు, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి దానిపై పట్టుసాధించాలని తెలిపారు. అవార్డు రావడం సంతోషంగా ఉందని మహిపతి శ్రీనివాస్ తెలిపారు. అనురాగ్ యూనివర్సిటీ సీఈవో నీలిమ, ఆయా విభాగాల డీన్లు, అంబిషన్స్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్‌ను అభినందించారు.

'బెల్టు' తీస్తారా.. కొనసాగిస్తారా..

గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు

పెద్దేముల్, జనవరి 21: గ్రామాల్లో బెల్టు షాపులు విచ్చల విడిగా కొనసాగుతున్నాయి. గల్లీకో బెల్టుషాపు ఉండడంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. ఎన్నికల సమయంలో దాడులు చేసి బెల్టుషాపులను అరికట్టిన ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, పోలీసులు ఇపుడు వాటి ఊసే ఎత్తడం లేదు. అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో బెల్టుషాపుల నిర్వాహకులు సొమ్ముచేసుకుంటున్నారు. మద్యం ప్రియుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని క్వార్టర్, బీర్‌బాటిళ్ల ఒక్కోదానిపై రూ. 20 నుంచి రూ.30 చొప్పున అధనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అదేంటని ప్రశ్నిస్తే.. మందుకావాలంటే అందరిని చూసుకోవాలి కదా.. అని దబాయిస్తున్నారని పలువురు చెబుతున్నారు. మండలంలో 37 గ్రామపంచాయతీలు, 10 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అర్ధరాత్రి వెళ్ళి తలుపుతట్టినా మద్యం దొరుకుతుండడంతో మద్యం ప్రియులకు అడ్డు, అదుపులేకుండా పోతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బెల్టుషాపులు పచ్చని సంసారాల్లో చిచ్చుపెట్టి, కుటుంబంలో కలహాలు రేగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మద్యం విక్రయాలను నిలిపివేయడంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కనిపించింది. అనంతరం మళ్ళీ బెల్టుషాపులు మొదలయ్యి, విక్రయాలు జోరందుకున్నాయి. బెల్టుషాపుల నిర్వాహకులను వైన్‌షాపుల యజమానులే ప్రోత్సహిస్తున్నారిని, ఎవరు వచ్చినా తాము చూసుకుంటామని వారికి ధైర్యంచెప్పి ప్రోత్సహిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్పందించి బెల్టుషాపులను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.


ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు బీజేపీలో చేరారు. ఆదివారం చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈమేరకు ఆయన కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కేటీఆర్

మేడ్చల్ టౌన్ , జనవరి 21 : గుండ్లపోచంపల్లికి చెందిన బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఆదివారం తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా గోల్డ్‌స్టోన్ స్కూల్ క్యాలెండర్‌ను కేటీఆర్ ఆవిష్కరించారు. కేటీఆర్‌ను కలిసిన మేడ్చల్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు వారిలో ఉన్నారు.

కంకరవేశారు.. బీటీ మరిచారు


బెన్నూరు లక్ష్మీ నారాయణపూర్ చౌరస్తా మధ్య రోడ్డుపై వేసిన కంకర

యాలాల, జనవరి 21 : ఆర్ అండ్ బీ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగా ప్రయాణికులు అష్టకష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. బెన్నూరు-లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా మధ్య రోడ్డుపై కంకరవేసి వదిలేయడమే దానికి నిదర్శనం. బెన్నూరు నుంచి లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా వరకు మూడు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా పాడైపోయింది. దీంతో అధికారులు మూడు నెలల క్రితం రోడ్డు మరమ్మత్తు పనులను చేపట్టారు. రోడ్డును తవ్వి కంకరవేశారు, కానీ తారు వేయకపోవడంతో మండల కేంద్రానికి, గోరేపల్లి, దేవనూర్ గ్రామాలకు వెళ్ళే ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంకర తేలిన రోడ్డుపై ప్రయాణించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహన దారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కంకర పరిచిన రోడ్డును వెంటనే తారు రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.


లబ్దిదారులతో మాట్లాడుతున్న ఎన్డీఎఫ్‌డీసీ సీఎండీ, సంయుక్త కార్యదర్శి నవీన్‌కుమార్‌షా

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

▸ ఎన్డీఎఫ్‌డీసీ సీఎండీ, సంయుక్త కార్యదర్శి నవీన్‌కుమార్‌షా

కీసర రూరల్, జనవరి 21 : ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్డీఎఫ్‌డీసీ సీఎండీ, సంయుక్త కార్యదర్శి నవీన్‌కుమార్‌షా అన్నారు. ఆదివారం నాగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా లభించే రుణాలు, ఆర్థిక సహాయం గురించి వివరించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, నోడల్ ఆఫీసర్, కెనరా బ్యాంక్ మేనేజర్ అనిల్ కుమార్, చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పాల్గొన్నారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ వైష్ణవి - ఆర్.సి.పురం
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
ప్రెస్టేజ్‌మాల్ - గచ్చిబౌలి	మిరాజ్ సినిమాస్ - చందానగర్
అట్రియమ్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
ఎస్2 సోమ - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట
జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్- అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
	జె.పి.సినిమాస్ - చందానగర్

ఊరూవాడా రామజపం

● అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వికారాబాద్‌లో బైక్ ర్యాలీ


రాములవారికి మహా మంగళ హారతి ఇస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి, నిర్వాహకులు

వికారాబాద్, జనవరి 21: అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం వికారాబాద్ పట్టణంలోని కొత్రేపల్లి హనుమాన్ నుంచి కొత్తగడి హనుమాన్ ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కొత్రేపల్లి హనుమాన్ ఆలయంలో పూజలు చేసిన అనంతరం అక్కడి నుంచి శివారెడ్డిపేట, ఎన్నెపల్లి, ఎన్టీఆర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తా, ఆలంపల్లి, కొత్తగడి వరకు పెద్దఎత్తున బైక్‌ర్యాలీని నిర్వహించారు. దారి పొడవునా జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు.

పరిగి: అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని పరిగిలోని సీతా రాముల వారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. సోమవారం పరిగి పట్టణంలో మధ్యాహ్నం 2గంటలకు శ్రీరాముల వారి మహాశోభయాత్ర ఉంటుంది. ఉదయం 7గంటలకు సీతారాములవారి ఆలయంలో పూజలు జరుగుతాయి. కాషాయ ధ్వజావిష్కరణ, సామూహిక పాలాభిషేకాలు, అఖండ రామనామస్మరణ, శ్రీరాములవారి ప్రతిష్ఠాపన ఎల్ఈడీల ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని తెలిపారు.

ఎన్కెపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో..

పూడూరు: మండలంలోని ఎన్కెపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఆలయంలో స్వచ్ఛ తీర్థ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయాల పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు శ్రమదానంలో పాల్గొనాలని దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు, పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి బూనేటి మారుతి కిరణ్ ఆధ్వర్యంలో ఎన్కెపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో స్వచ్ఛ తీర్థ అభియాన్ పరిశుభ్రత పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూడూరు మండల అధ్యక్షుడు జాజుల అనిల్, మండల ఉపాధ్యక్షుడు రాఘవేందర్, రాజు, రాఘవేందర్‌రెడ్డి, ప్రకాష్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రతీ ఇంట్లో దీపాలు వెలిగించాలి

మేడ్చల్ టౌన్: రామ మందిర ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రతీ ఒక్కరు సోమవారం సాయంత్రం తమ ఇళ్లలో ఐదు దీపాలు వెలిగించాలని ఆర్ఎస్ఎస్ స్వయంసేవక్ విశ్వ కోరారు. అయోధ్యలో నిర్మిస్తున్న భవ్యరామమందిరం నిర్మాణం ప్రతీ హిందువు గర్వించదగ్గ విషయమన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

మేడ్చల్ టౌన్: అయోధ్యలో సోమవారం చేపడుతున్న ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం మేడ్చల్ పట్టణంలోని రాఘవేంద్రనగర్ కాలనీలో స్థానికులు గణపతి, హోమం, గాయత్రి హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించిన హోమంలో స్థానిక మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా అయోధ్యలో చేపట్టే కార్యక్రమాలను ప్రజలు నేరుగా తిలకించే విధంగా కాలనీలో ప్రత్యేక స్ర్కీన్‌లను ఏర్పాటు చేయటంతో పాటు పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహిస్తున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. అదేవిధంగా మేడ్చల్ పట్టణంలోని ప్రధాన మార్కెట్‌లో కాషాయ తోరణాలు ఏర్పాటు చేశారు.

సీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

యాలాల: అయోధ్య రామయ్య ప్రతిష్ఠాపన నేపథ్యంలో జుంటిపల్లి సీతారామస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించనున్నట్లు దేవాలయ ధర్మకర్త రాఘవేందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 7.25నిమిషాలకు అభిషేకం, ఉదయం 11.11గంటలకు పల్లకీ సేవ, 12.30గంటలకు అన్నదానం, 6గంటలకు దీపోత్సవం, రాత్రి 7గంటలకు భజన కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు.

కులకచర్ల: అయోధ్య భవ్య రామమందిరం పునప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా భారత ప్రధాని నరేంద్రమోది పిలుపు మేరకు స్వచ్ఛ్ తీర్థ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కులకచర్ల మండల కేంద్రంలోని మైలమ్మ చెరువు హనుమాన్ దేవాలయం, శివాలయాన్ని బీజేపీ శ్రేణులు శుభ్రపర్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు గాదె మహిపాల్ ముదిరాజ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అంజిలయ్య, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు మహిపాల్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటేశ్, సీనియర్ నాయకులు కర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్‌లో బైక్ ర్యాలీ


మేడ్చల్ టౌన్: హారతి పడుతున్న మహిళలు


దోమ: కాషాయ తోరణాలు కడుతున్న యువకులు


పూడూరు: ఎన్కెపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో శుభ్రం చేయిస్తున్న మారుతి కిరణ్

కర సేవకులను గుర్తు చేసుకుందాం

మోమిన్‌పేట్: అయోధ్యలో శ్రీ రామజన్మ భూమి కరసేవకుల్లో మోమిన్‌పేట్ నుంచి 1990, 1992లో అయోధ్య శ్రీరామ జన్మభూమి కరసేవలో పాల్గొన్న కరసేవకులు వీరు. అప్పుడు ఇక్కడి నుంచి దాదాపు 25మంది అయోధ్యకు వెళ్లారు. మోమిన్‌పేట్, వెల్చాల్, చక్రంపల్లి, చంద్రాయన్‌పల్లి, దేవరంపల్లి, రావులపల్లి తదితర గ్రామాలకు చెందిన వారు అయోధ్యకు వెళ్లి పునర్మిణంలో తమ వంతు పాత్ర పోషించారు. ఈ నెల 22న (సోమవారం) జరిగే అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా వారి సేవలను స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు.


మోమిన్‌పేట్: 1990 నాటి కరసేవకులు

క్రైం కార్నర్

డీసీఎం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 21: డీసీఎం వ్యాన్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బి.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధి వెంకటాపూర్ రోడ్డులో శనివారం రాత్రి రోడ్డు దాటుతున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి(40)ని డీసీపీ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకోని పరిసరాలను పరిశీలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తపాల అధికారి నర్సింహులు నిర్వాహకంపై విచారణ

కులకచర్ల, జనవరి 21: చౌడాపూర్ తపాల అధికారి నర్సింహులు నిర్వాహకంపై ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు. చెత్తబండిలో ఆధార్, పాన్, ఏటీఎం కార్డులు పడేయడంతో తహసీల్దార్ ప్రభు పాలమూర్ తపాలా శాఖ సూపరింటెండెంట్‌కు చౌడాపూర్ తపాల అధికారి నర్సింహులుపై ఫిర్యాదు చేశారు. వచ్చిన వందలాది ఆధార్, పాన్, ఏటీఎం కార్డులు ప్రజలకు పంపిణీ చేయకుండా చెత్తబండిలో వేసిన విషయం తెలిసిందే. స్పందించిన తపాలశాఖ ఉన్నతాధికారులకు విచారణ చేపట్టారు. చౌడాపూర్‌లో శనివారం సాయంత్రం పారిశుధ్య కార్మికులతో, సర్పంచ్ రంగారెడ్డితో విచారణ అధికారి మాట్లాడారు. తాను సేకరించిన వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తానని శాఖ పరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

శుభ కార్యంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


శుభ కార్యంలో పాల్గొన్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

కొడంగల్, జనవరి 21: కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కోస్గి ఏటీకే ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన శుభ కార్యంలో కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు. కోస్గి మండలంలోని మీర్జాపూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి కూతురి శారీ ఫంక్షన్‌కు హజరై ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలి


ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ త్రిల్లేశ్వరావు

మేడ్చల్ టౌన్, జనవరి 21: అర్హులైన ప్రతీఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ త్రిల్లేశ్వరావు అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలను ఆయన పరిశీలించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీఒక్కరు ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవటంతో పాటు, ఓటరు లిస్టులో తప్పులు సవరించుకనే వీలు కల్పిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు చేపట్టిందన్నారు. చాలామంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.

కులకచర్ల: 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి తెలిపారు. మండల వ్యాప్తంగా ఆదివారం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించారు. కులకచర్ల గ్రామంలోని పోలింగ్ కేంద్రం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. గ్రామాల్లో అవగాహన కల్పించి ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. 18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు, ఓటర్ల చిరునామా మార్పునకు ఓటర్ల నుంచి అధికారులు బీఎల్‌వోలు దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కొడంగల్: ప్రత్యేక ఓటరు నమోదులో భాగంగా ఆదివారం కొడంగల్ మండలంలోని ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు ప్రక్రియను కొడంగల్ తహసీల్దార్ బీ.విజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను తహసీల్దార్ మనోహరచక్రవర్తి పరిశీలించారు. జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 25న జరిగే ఓటర్ల జాతీయ దినోత్సవం సందర్భంగా మండలంలోని గ్రామపంచాయతీల్లో ర్యాలీలు నిర్వహించి ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు, ఆర్ఐ రాజు, జూనియర్ అసిస్టెంట్ మహేశ్, అలవేలు, సునిత, మౌనిక, హరిత, రఘు పాల్గొన్నారు.


కొడంగల్‌లో ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్


మోమిన్‌పేట్: నూతన ఓటరు దరఖాస్తులు స్వీకరిస్తున్న బూత్ లెవల్ అధికారి నర్సింహులు

ఎస్ఐ నర్సింహగౌడ్‌కు సన్మానం


ఎస్ఐ నర్సింహగౌడ్‌ను సన్మానిస్తున్న ఆటోయూనియన్ నేతలు

మేడ్చల్ టౌన్, జనవరి 21: విధి నిర్వాహణలో ఉత్తమ సేవలందించిన మేడ్చల్ ఎస్ఐ నర్సింహగౌడ్‌కు ప్రత్యేక అవార్డు అందుకున్న సందర్భంగా ఆదివారం మేడ్చల్ ఆటో యూనియన్ నాయకులు ఆయనను సన్మానించారు. పోలీసుశాఖలో ప్రతిభతో పాటు, ప్రత్యేక సేవలందించిన అధికారులను ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వం ఏటా అవార్డుల ప్రధానోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఇందులో ఈ సారి మేడ్చల్ పీఎస్‌కు చెందిన ఎస్ఐ నర్సింహగౌడ్ ఎంపికయ్యారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి చేతుల మీదుగా ఎస్ఐ అవార్డును అందుకున్నారు.

మున్సిపల్ కౌన్సిలర్‌కు పరామర్శ

కొడంగల్ రూరల్, జనవరి 21: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక మైనార్టీ నాయకులు ఎస్ఎం.గౌసన్, ఆసీఫ్‌ఖాన్, సయ్యద్ ఇసాక్ పాష, ఎండీ.వాజీద్, ఎండీ.సిరాజుద్దీన్ తదితరులు ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

తాండూరు వాసికి పురస్కారం


పుడమి రత్న విశిష్టసేవ పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీకాంత్

తాండూరు, జనవరి 21: పుడమి సాహితీ వేదిక తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో గ్రంథాలయాల్లో వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను తాండూరు డాక్యుమెంటరీ రైటర్ శ్రీకాంత్‌కు పుడమి రత్న విశిష్ట సేవ పురస్కారం లభించింది. ఆదివారం నల్గొండలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమి చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ పుడమి సాహితి వేదిక అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరి పాల్గొన్నారు.

మల్లు రవిని కలిసిన మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్

మేడ్చల్ టౌన్, జనవరి 21: ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవిని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మల్లు రవికి శాలువా కప్పి సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.


మల్లు రవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వజ్రేష్ యాదవ్

మహోన్నతుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


కార్యక్రమంలో కృష్ణమూర్తి, తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 21: దేశంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఘట్‌కేసర్ మండల మాజీ వైఎస్ ఎంపీపీ ఎదుగని కృష్ణమూర్తి తెలిపారు. దులాబాద్ చౌరస్తాలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కృష్ణమూర్తి 44వ జ్ఞాన మాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గుమ్మడి దుర్గయ్య, ఉపాధ్యాక్షుడు పడిగెం ఆంజనేయులు, సభ్యులు మల్లేష్, శంకర్, అనిల్, శ్రీశైలం, శ్రీకాంత్, ధనుంజయ్, నాగరాజు, మురళి, సాయి, శివ, సుమంత్, లింగం, నాగేష్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద బోర్ మోటార్ ఏర్పాటు


బోర్ మోటార్ ప్రారంభిస్తున్న దాత రమేష్‌గుప్తా

కీసర, జనవరి 21: డబుల్‌బెడ్ రూం ఇళ్లకు నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటానని కీసర మాజీ ఎంపీటీసీ రమేష్‌గుప్తా తెలిపారు. ఆయన ఆదివారం రూ.లక్షా 50,000లు వెచ్చించి కీసర డబుల్‌బెడ్ రూం ఇళ్ళ వద్ద బోర్ మోటార్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డబుల్‌బెడ్ రూం కాలనీవాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి పరామర్శ


రాంలింగారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రోహిత్‌రెడ్డి

తాండూరు, జనవరి 21: జినుగుర్తి మాజీ సర్పంచ్ ఏసీ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి తనయుడు మాజీ ఎంపీపీ, మండల రైతు సమన్వయసమితి కన్వీనర్ రాంలింగారెడ్డిను కలిసి మాట్లాడి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

వైభవంగా సేవాలాల్ మరియమ్మ జాతర


జాతర ఉత్సవాల్లో పాల్గొన్న గిరిజనులు

బషీరాబాద్, జనవరి 21: మంతన్‌గౌడ్ తండాలో గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్, మరియమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. గిరిజనులు ఇంటింటా బోనాలతో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం ఎదుట గిరిజన యువతులు, మహిళలు సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో నృత్యాలు చేశారు. తండా వాసులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. అనంతరం ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జాతరలో స్థానిక యువకుడు చౌహన్‌సంతోష్ తండావాసులకు సంత్ సేవాలాల్ మహరాజ్ జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాయాత్రిరామునాయక్, ఎస్టీసెల్ జిల్లా నాయకులు భీస్సీలాల్, ఉపసర్పంచ్ ధన్‌సింగ్, పోస్ట్‌మన్ హరిచందర్, హెడ్‌కానిస్టేబుల్ రాము, లైన్‌మన్ రాజేందర్, గోపాల్‌నాయక్, తండా పెద్దలు, గిరిజనులు పలువురు పాల్గొన్నారు.

గట్టు మైసమ్మ జాతరకు శ్రీకారం

ఘట్‌కేసర్: ఈ నెల 28న జరగనున్న ఘట్‌కేసర్ గట్టు మైసమ్మజాతర క్రతువుకు ఆదివారం శ్రీకారం చుట్టారు. జాతరకు ముందు వారం ఘట్‌కేసర్‌లోన నడిఊర్లో పండుగ నిర్వహించి, జాతర ఉత్సవాన్ని ప్రారంభించటం ఆనవాయితీ. అందులో భాగంగా ఘట్‌కేసర్‌లోని నడిఊర్లో పండుగ నిర్వహించారు. ఆయా కుల వృత్తుల నిర్వహకులు ఈ పండుగను నిర్వహిస్తారు. 28న గట్టు మైసమ్మజాతరను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కులవృత్తుల ప్రతినిధులు పాల్గొని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా దేవాలయ ఈఓ భాగ్యలక్ష్మి ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ముల్లి పావని, మాజీ ఎంపీపీ బండారు దాసు, కౌన్సిలర్ కడపోల్ల మల్లేష్, కాంగ్రెస్ నాయకుడు ముత్యాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ అమ్మవారికి పూజలు

శామీర్‌పేట: కట్టమైసమ్మ అమ్మవారిని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెతో పాటు శామీర్‌పేట జడ్పీటీసీ అనితలాలయ్యలు అమ్మ వారికి పూజలు చేశారు.


నడిఊర్ల పండుగలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని

మేడ్చల్ చెక్‌పోస్టు చౌరస్తా డివైడర్ మూసివేత


చెక్‌పోస్టు వద్ద మూసేసిన చౌరస్తా డివైడర్

మేడ్చల్ టౌన్, జనవరి 21: హైదరాబాద్-నాగర్‌పూర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మేడ్చల్ పట్టణం చెక్‌పోస్టు వద్ద నిర్మిస్తున్న రహదారి వంతెన పనులకు ఆటంకం కలిగిస్తున్న యూటర్న్‌ను జాతీయ రహదారుల అధికారులు బారిగేట్లు పెట్టి మూసివేశారు. గండిమైసమ్మ వెళ్లాలనుకునే వాహనదారులు పారిశ్రామికవాడ డివైడర్ నుంచి లేక, రింగ్ రోడ్డు సమీపంలోని సర్వీసు రోడ్డు జంక్షన్ మీదుగా గండి మైసమ్మకు చేరుకునే విధంగా వీలు కల్పించారు. కాగా గండి మైసమ్మ నుంచి మేడ్చల్ చెక్‌పోస్టు వరకు వచ్చే వాహనాలు నేరుగా వచ్చేవిధంగా వీలు కల్పించారు. రహదారి వంతెన పనులు పూర్తయ్యేంత వరకు గండిమైసమ్మ వెళ్లే వాహనదారులు ఇకపై రింగ్ రోడ్డుకు అనుకుని ఉన్న సర్వీసు రోడ్డు లేదా, పారిశ్రామిక వాడ సమీపంలోని యూటర్న్ నుంచి రోడ్డు దాటి వెళ్లాల్సి ఉంటుందని పోలీసులు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


బహుమతులు అందజేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్, జనవరి 21: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి దోహదం చేస్తాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ అన్నారు. బొట్లవనితండా పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ నెల 13న ప్రారంభమైన పోటీల్లో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో దేవులనాయక్, బొట్లవనితండా జట్ల మధ్య జరగగా దేవ్లనాయక్ తండా జట్టు విజయం సాధించింది. గెలుపొందిన జట్టుకు రూ.22,222 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, సీనియర్ నాయకులు జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు


బషీరాబాద్, జనవరి 21: మండల కేంద్రంలో ప్రముఖ దర్గా ఉర్సే షరీఫ్ హజరత్ షహింషా ఖాద్రి ఉర్సు ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను తాండూరు మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణ్‌రావు చేతులమీదుగా ఆదివారం సాయంత్రం కమిటీ నిర్వహకులు విడుదల చేశారు. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 18వ తేదీన సందల్, 19న చిరగ్ 20న ఖవాలీలను నిర్వహిస్తున్నట్లు ఉర్సు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎండీ.మస్తన్, ఉపాధ్యక్షుడు షేక్ మహిమూద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువనాయకుడు రోహిత్‌మహరాజ్, చంద్, అంజాద్ పాల్గొన్నారు.

షబ్బీర్ అలీని కలిసిన డీసీసీ అధ్యక్షుడు


షబ్బీర్ అలీని కలిసి సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్

మేడ్చల్ టౌన్, జనవరి 21: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ సలహాదారుడిగా నియమితులైన మాజీ మంత్రి షబ్బీర్ అలీని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆదివారం మర్యాద పూరకంగా కలిశారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీకు శాలువా కప్పి జిల్లా నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొపల్లి మాజీ సర్పంచ్ దేవేందర్, పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సీఐ రాజును కలిసిన టీడీపీ నేతలు


పోచారం సీఐ రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీటీడీపీ నేతలు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 21: పోచారం ఐటీసీ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన సీఐ రాజును ఆదివారం ఘట్‌కేసర్ మండల టీటీడీపీ అధ్యక్షుడు వేముల సంజీవగౌడ్, నాయకులు సురేందర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సీఐకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అనాథలకు చేయూతనందించాలి

శామీర్‌పేట, జనవరి 21: అనాథలకు చేయూతనందించాలని కేసీఆర్ సేవాదళం నాయకుడు మహ్మద్ అఫ్జల్‌ఖాన్ అన్నారు. ఆదివారం తన జన్మదినం సందర్భంగా శామీర్‌పేట మండలం తుర్కపల్లి పరిధిలోని సేవ్‌ఆల్‌రీచ్‌ఆల్ (సరస్) అనాథాశ్రమంలో చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. అనాద వృద్ధులకు, చిన్నారులకు పండ్లు పంపిణీఈ చేశారు. ఈ కార్యక్రమంలో తాడెం కుమార్, మహ్మద్ అజ్మత్, ఆశ్రమ సిబ్బంది నాగయ్య, రెడ్డమ్మ, పద్మ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.